క్లుప్తంగా

ముగిసిన సప్తాహం

బేల: మండలంలోని దహెగాం గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న బాజీరావు బాబా సప్తాహం ముగింపు వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో, చిన్నారులను దేవతల రూపంలో అలకరించి పల్లకి ఊరేగింపు చేపట్టారు. అనంతరం బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాంఖడే వామన్, సామ రూపేష్‌రెడ్డి, బొర్రే శంకర్, గోడే అవినాష్, వాంఖడే నయన్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న చండీయాగం



పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ దంపతులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వశాంతి చండీయాగం కొనసాగుతోంది. సోమవారం రెండో రోజు మహోత్సవంలో భాగంగా శ్రీలక్ష్మి గణపతి, శ్రీ రుద్ర మృత్యుంజయ సహిత అమృత పాశుపతాస్త్ర హోమం నిర్వహించారు. సాయంత్రం శ్రీబుద్ధి, సిద్ధి సమేత వరసిద్ధి వినాయక కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. యాగంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఔదార్యం చాటిన బాల వికాస స్వచ్ఛంద సంస్థ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో గత కొన్ని రోజు లుగా నీటి సమస్య ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని డీఈవో ప్రణీత బాలవికాస స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ సంస్థ సభ్యులు స్పందించారు. ఔదార్యం చాటి సోమవారం రూ.50వేలు వెచ్చించి పాఠశాల ఆవరణలో బోరు వేయించారు. బోరు వేయించిన సంస్థ సభ్యులకు డీఈవో కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం

నేరడిగొండ: గ్రాడ్యుయేషన్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేయనున్న నరేందర్ రెడ్డిని పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద పట్టభద్రులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి మండల కేంద్రానికి చేరుకున్నారు. శ్రీ సరస్వతి శిశు మందిర్, రెయిన్‌బో, శ్రీసేవ పాఠశాలలు, సాయి చైతన్య డిగ్రీ కళాశాలల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు.

బోథ్: మండల ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన అతుల్‌ను చింతల్ బోరి గ్రామానికి చెందిన నాయకులు సోమవారం శాలువాతో సత్కరించారు. గ్రామానికి మొదటిసారి రావడంతో ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ముండె ఈశ్వర్, విజయ్, గ్రామ పటేల్ మాధవరావ్ గజానంద్, బాలాజీ యాదవ్, సదానందం, ముండె రామేశ్వర్ రెడ్డి, ధన్వే సంతోష్, టీపీ శ్యామ్ పాల్గొన్నారు.

క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఆడే గజేందర్

ఇచ్చోడ: క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విఠల్ రెడ్డి గార్డెన్‌లో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, సత్యవతి కోటేశ్, నారాయన్‌రెడ్డి, బద్దం పోతారెడ్డి, ముస్తాఫా పాల్గొన్నారు.

పాఠశాలల్లో రైతు దినోత్సవం

బోథ్: మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాగబూషణం, వేదం, విజ్ఞాన్‌తో పాటు సొనాల గ్రామంలోని వివేకానంద పాఠశాలలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. నాగబూషణం పాఠశాలలో రైతులను సన్మానించారు. విద్యార్థుల రైతు వేషధారణ ఆకట్టుకుంది. వివేకానంద పాఠశాలలో వ్యవసాయ పరికరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీకి ప్రహరీ కరువు

- విద్యార్థినులకు రక్షణ చర్యలు శూన్యం
- సంచరిస్తున్న పశువులు
- పట్టించుకోని అధికారులు



కేజీబీవీ ఆవరణలో సంచరిస్తున్న పశువులు

తాంసి: పేద విద్యార్థులతో పాటు అర్ధంతరంగా చదువు మానేసిన బాలికలు చదువుకు దూరం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో కేజీబీవీ బాలికల విద్యాలయాలను ప్రభుత్వం ప్రారంభించింది. కేజీబీవీల ద్వారా బాలికలకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. విద్యార్థులకు ఉచితంగా విద్యతో పాటు వసతి, భోజనం, దుస్తులను అందజేస్తూ చదువుకు ప్రోత్సాహం అందిస్తుంది. కానీ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలలో పలు చోట్ల సరైన వసతులు లేక విద్యార్థినులకు ఇబ్బంది తప్పడం లేదు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించక పోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అధికారుల నిర్లక్ష్యంతో, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతో కేజీబీవీలలో చదువుతున్న విద్యార్థినిలకు కనీస రక్షణ కరువైతుంది. తాంసి మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి ముందరి వైపున ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి కేజీబీవీ కళాశాల ఆవరణలో మందుబాబులు మద్యం సేవిస్తుంటారు. దీంతో బాలికలకు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రహరీ లేక..

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 170 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. కేజీబీవీకి భవన నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా.. భవనం ఎదుంట ప్రహరీ నిర్మాణం ఇప్పటి వరకు చేపట్టలేదు. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కేజీబీవీ ముందు నుంచే రైతులు పంటచేలకు వెళ్లే దారి ఉంది. ముందర ప్రభుత్వ జూనియర్ కళాశాల, పక్కన ఆశ్రమోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు సైతం ఉన్నాయి. ప్రహరీ గోడ లేక రైతుల ఎడ్లబండ్లు, పశువులు కేజీబీవీ ఆవరణ ముందు నుంచే వెళ్తున్నాయి. ఆవరణం అంతా అధ్వానంగా మారుతోంది. అలాగే కేజీబీవీ విద్యార్థులకు రక్షణ కరువైంది.

క్రీడలకు దూరం..

కేజీబీవీ భవనం ఎదుంట ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు క్రీడలకు దూరమవుతున్నారు. విద్యార్థినులకు సరైన ఆటస్థలం లేక ఆటలు ఆడించలేని పరిస్థితి. ప్రహరీ నిర్మాణం లేక విద్యార్థినులు ఆటలకు దూరమవడంతో పాటు పూర్తిగా రక్షణ సైతం లేకుండా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కేజీబీవీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని ప్రజలు, విద్యార్థినులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

కేజీబీవీ భవనం ఎదుంట ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ప్రహరీ నిర్మాణం లేక కేజీబీవీ భవనానికి బయట ఎలాంటి ప్రత్యేక ఆవరణ లేకుండా పోతుంది. దీంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. కలెక్టర్‌కు సైతం ప్రహరీ నిర్మాణం చేపట్టేలా చూడాలని విన్నవించాం.

– ప్రియాంక, కేజీబీవీ ప్రత్యేకాధికారి

సామాజిక సేవే భీం ఆర్మీ లక్ష్యం



స్వెటర్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: సామాజిక సేవే భీం ఆర్మీ లక్ష్యమని భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని బొడ్డిగూడ గ్రామంలో భీం ఆర్మీ ఆధ్వర్యంలో వృద్ధులకు, చిన్నారులకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భీం ఆర్మీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలను గుర్తించి దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యవంశీ ఉత్తం, కాంబ్లే అతీష్, సింగారి కిరణ్, కాంబ్లే రాజేందర్, వాగ్మారే విశాల్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

‘అమిత్ షా రాజీనామా చేయాలి’



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

తలమడుగు: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేసేవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అంబేడ్కర్ దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఝరి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘ నాయకులు ఆత్రం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. కార్యక్రమంలో పెందుర్ మాధవరావు, పెందుర్ రఘు, రాజు, అరవింద్, అభిలాష్, గంగన్న, ప్రవీణ్, జైతు పటేల్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. హోంమంత్రిగా ఉండి చట్టాలను సక్రమంగా అమలు పరిచేలా చూడాల్సిన అమిత్ షా, అంబేడ్కర్‌పై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



మొక్కకు నీరు పోస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాల గురించి ఆరా తీశారు. కేసులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రూరల్ మండలంలో దొంగతనాల నివారణ కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. డీఎస్పీ వెంట ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణీధర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో క్రైస్తవులకు గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రైస్తవులకు తగిన గుర్తింపు ఇచ్చిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం గంగారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో ప్రతీ ఏటా క్రైస్తవులకు ఇచ్చే కానుకలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. అన్ని మతాల ప్రజలకు గౌరవం ఇచ్చి అందరి పండుగలు ఘనంగా జరుపుకునే విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కలశ పూజలో బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని రాజులతండా గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ కలశ పూజ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కలశాన్ని బుద్దికొండ శ్రీ శబరిమాతా ఆలయం నుంచి రాజులతండా గ్రామం వరకు ఊరేగించగా, శబరిమాత ఆశ్రమం వద్ద వారు పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత వైపు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, సదానందం, సాబ్లే ప్రతాప్ సింగ్, సరీచంద్, నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండలంలోని చిన్న బుగ్గరాం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు బంద్

బోథ్: క్రిస్మస్ సందర్భంగా బుధవారం, గురువారం బోథ్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో సీసీఐ కొనుగోలు కేంద్రాలకు సెలవు ఉంటుందని, పత్తి కొనుగోళ్లు నిర్వహించడం జరగదని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్‌లు తెలిపారు. తిరిగి 27వ తేదీన కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. రైతులు గమనించాలని కోరారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎదులాపురం: ఆటో, మోటర్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రొగ్రెస్ ఆటో, మోటర్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర నాయకులు దళిత్ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన మహాసభల్లో జిల్లా తరఫున పాల్గొని మాట్లాడారు. మోటర్ వాహన చట్టాన్ని రద్దు చేయాలని, ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12 వేలు చెల్లించాలని కోరారు.

బెల్ అందజేత

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి టైమర్ బెల్ విరాళంగా అందజేశాడు. పాఠశాల పూర్వ విద్యార్థి కాడిగిరి శారద, భర్త ఆశన్న యాదవ్‌లు రూ.5వేల విలువ గల టైమర్ బెల్ అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఎదులాపురం: ఈనెల 26న సీపీఐ ఆవిర్భావ వేడుకలు జిల్లా, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందులో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

బోథ్: మండలంలోని మర్లపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఫుట్‌బాల్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం కప్‌లో పోటీల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఈనెల 27న హైదరాబాద్‌లోని హకీంపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కత్తూరి హన్మాండ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు షబ్బీర్, వనిత అభినందించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో జవహర్‌లాల్

నార్నూర్: ఇందిరమ్మ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో జవహర్‌లాల్ అన్నారు. సోమవారం మండలంలోని సోనాపూర్, భేతాల్‌గూడ, బాలన్‌పూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ సర్వేను పరిశీలించారు. యాప్‌లో సాంకేతిక సమస్య రావడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న ఎంపీడీవో, ఎంపీవోలను సంప్రదించాలని సూచించారు. ఈనెల 31లోపు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట ఎంపీవో సాయిప్రసాద్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఆర్టీల సమ్మెకు ఎమ్మెల్యే మద్దతు



మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఉట్నూర్‌రూరల్: డిమాండ్లను నెరవేర్చాలని సీఆర్టీలు ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట చేపట్టిన సమ్మెకు బోథ్ ఎమ్మెల్యే అనీల్ జాదవ్, బీఆర్‌ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్‌లు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో సీఆర్టీల సమస్యలను దృష్టిలో ఉంచుకొని, జీతాలు పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్, భరత్ చౌహాన్, రాజ్ కుమార్, పుష్పరాణి, భరత్, జయచంద్ర, సీఆర్టీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



ప్రయోగాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గణితశాస్త్ర చిత్రపటాలు, చార్ట్‌లు, సూత్రాలు, ప్రయోగదీపికలు, సిద్ధాంతాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ రవికుమార్, గణిత ఉపాధ్యాయులు శ్వేత, శ్రావ్య, మౌనిక, దివ్య లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు



వేషధారణలో చిన్నారులు

బోథ్: మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ సంప్రదాయ వేషధారణ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, కరస్పాండెంట్ పురుషోత్తం రెడ్డి, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని హోలీ ట్రినిటీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిఎల్.జోసెఫ్ చర్చి ఫాదర్ క్రిస్మస్ సందేశమిచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీమన్, ఉపాధ్యాయులు విజయ్, నితేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన రాజేశ్

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో వారి స్వగృహంలో బీఆర్‌ఎస్‌వీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల సమస్యలపై పోరుబాట పట్టాలని అదే విధంగా జిల్లాలో బీఆర్‌ఎస్‌ను బలోపేతానికి కృషి చేయాలన్నారు.

దుప్పట్లు పంపిణీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దొంగచింత గ్రామంలో బెతెస్థ మెర్సిఫుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బత్తుల డానియల్, సభ్యులు శ్యాం, రిజాయిస్, సిస్టర్ అనిత, ప్రణయ్, గ్రామ పటేల్ జుగాదిరావు, రాహుల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నేరడిగొండ: మండలంలోని గుత్పాల గ్రామస్తులు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను సోమవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన గ్రామాభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు.

విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్గొండలో నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శ్రీధర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల అంబేడ్కర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నూతన కమిటీ పనిచేస్తుందని అధ్యక్షుడు బొంకంటి సుభాశ్, ఉపాధ్యక్షుడు భరత్, ప్రధాన కార్యదర్శి కాంబ్లే ప్రజ్ఞశీల్‌లు అన్నారు. జాయింట్ సెక్రటరీగా దేవానందం, ప్రచార కార్యదర్శిగా రాములు, ట్రెజరర్‌గా రాజేశ్వర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మల్లుబాయిలను ఎన్నుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐ సునీల్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని చించర్‌వాడకాలనీలో దొంగతనాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరుకు వెళ్లిన సమయంలో విలువైన బంగారు, వెండి, నగదును బ్యాంకు లాకర్, ఇంటి రహస్య ప్రదేశాల్లో భద్రపర్చుకోవాలన్నారు. ఎవరైన అనుమానిత వ్యక్తుల కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాలు జరిగితే నిందితులను సులువుగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, సిబ్బంది హన్మంత్, ఆశన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంగీత అన్నారు. సోమవారం కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ, ముథూట్ ఫిన్‌కార్ప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 120 మంది నిరుద్యోగులు హాజరు కాగా, రాత పరీక్ష ద్వారా 40 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్వ్యూ ద్వారా 20 మందిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. నెలకు రూ.20వేల వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. కళాశాల లెక్చరర్లు శ్రీధర, మంజుల, హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ మేనేజర్ వినయ్, కుమార్ పాల్గొన్నారు.